కథ

# ఓ సుబ్బారావు కథ

**ప్రపంచంలో అన్నిటికన్నా హీనమైనది- 'నేను బలహీనుణ్ణి' అనుకోవడం**

-స్వామి వివేకానంద

★ ★ ★

'లాభం లేదు. ఏదోక మంచి పనిచేసి గొప్ప పేరు సంపాయించాలి' మాట పన్నెండోసారి మనసులో అనుకున్నాడు సుబ్బారావు.

ఆ విషయం గురించే దాదాపు అరగంట సేప ట్నుంచీ ఆలోచిస్తున్నాడు. ఏదయినా ఒక మంచి పని చేసి గొప్ప పేరు సంపాదించి చరిత్రలో చిరస్థా యిగా నిలిచిపోవాలనేది అతడి లక్ష్యం. ఇంతకు ముందయితే ఆ కోరిక-ఎపుడయినా ఒంటరిగా ఉన్నప్పుడో, గొప్పవాళ్ల జీవిత చరిత్రలు చదివిన ప్పుడో- మాత్రమే గుర్తొచ్చేది.

కానీ, ఈమధ్య ఎందుకో రోజులో కనీసం నాలుగో వంతయినా ఆ విషయమే మనసులో మెదులుతుంది.

సుబ్బారావుకి ఓ గొప్ప పారిశ్రామికవేత్తగానీ, గొప్ప నటుడుగానీ లేదా మంచి క్రీడాకారుడుగానీ లేదంటే కనీసం తనకై తను స్వంతంగా కట్టించిన ఒక స్కూల్లో వీధిబాలలకు 'ఉచిత విద్యాబోధన' లాంటిది చేసి గుర్తింపు పొందాలనీ...

'ఐడెంటిటీ క్రైసిస్'

అయితే- అది ఐడెంటిటీ క్రైసిస్ అని సుబ్బారా వుకి తెలీదు. దాన్నే లక్ష్యం అనుకుంటున్నాడు. ఐడెంటిటీ క్రైసిస్‌కీ, లక్ష్యానికీ తేడా ఉంది. మొద టిది గుర్తింపుకోసం రకరకాల ఆలోచనలతో రకర కాల పనులు చేయడం. రెండోది- జీవితంలో ఒకే గోల్‌ను పెట్టుకుని దాన్ని సాధించే దిశగా కృషి చెయ్యటం.

ఓ గొప్ప పారిశ్రామికవేత్త కావాలంటే ఏయే లక్ష ణాలుండాలో సుబ్బారావుకి క్షుణ్ణంగా తెలుసు. ఆ విషయంలో అతడికి ధీరూబాయ్ అంబానీయే ప్రేరణ.

గుజరాత్‌లోని ఛోర్వాడ్ అనే ఓ పల్లెటూర్లో ఒక టీచరుకి కొడుకుగా పుట్టి, చదువుకోవటానికి స్థోమత లేక రోజూ సాయంత్రాలు బజ్జీలు అమ్ము కుని, 'ఇహ ఇలా అయితే జీవితంలో ఎదుగుదల ఉండదని' కేవలం ఐదు వందల రూపాయలతో ముంబై చేరుకుని, అక్కడ ఎన్ని కష్టాలు పడ్డాడో, ఎన్ని నిద్రలేని రాత్రుళ్ళు ఒంటరిగా గడిపాడో, మిగిలిన వాళ్లంతా జీవితాన్ని అనుభవిస్తుంటే తను మాత్రం భవిష్యత్తు గురించి ఎన్ని కలలు కనే సాడో... కేవలం భగవంతుడికొక్కడికే తెలిసుం డాలి.

ఆ తపనలోంచి పుట్టిందే 'రిలయెన్స్'

అతడి లక్ష్యం, దానికోసం పడ్డ కష్టం 'బిజినెస్ మహారాజాస్'లో చదువుతుంటే సుబ్బారావుకి ఒళ్ళు గగుర్పొడిచేది. ఆ క్షణంలో తనూ అంతటి వాడిని కావాలన్న కోరిక బలంగా నాటుకుపోయేది.

ఓసారి- అలా చదివి ప్రేరణ పొంది, తను కూడా ఏదయినా సరే ఒక వ్యాపారం ప్రారంభించాలని, సలహా కోసం తన స్నేహితుడు రాజు దగ్గరకెళ్లాడు.

కుశల ప్రశ్నలయ్యాక సుబ్బారావు తన మనసు లోని కోరికను స్నేహితుడి ముందుంచాడు. రాము సుబ్బారావువైపు 'నీకేమైనా మతిపోయి మాట్లాడు తున్నావా?' అన్నట్టుగా ఓ చూపు చూసి చిరునవ్వు నవ్వాడు.

టేబుల్‌సొరుగు లాగి డబ్బు లెక్కపెట్టుకుంటూ ''ఏం బిజినెస్ చేయాలనుకుంటున్నావ్?'' అన్నాడు రాజు.

''అదే నిర్ణయించుకోలేకపోతున్నాను. నువు అదే ఫీల్డులో ఉన్నావు కదా. మార్కెట్ అంతా నీకు బాగా తెలిసుంటుందని నీ దగ్గరకి వచ్చా'' అన్నాడు.

రాజు కనీసం సుబ్బారావు వంక చూడనయినా చూడకుండా ''నీకు తెలుసో లేదో..ఇప్పుడు మార్కెట్లన్నీ డల్‌గా ఉన్నాయి. ఏ వ్యాపారమూ సరిగ్గా జరగడం లేదు. అంతెందుకు మా షాపు సంగతే తీసుకో. పండగ సీజనయితే ఇంతకు ముందు షాపులో అడుగుపెట్టడం కూడా కష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు చూడు ఎంత బోసిగా వుందో'' అన్నాడు.

అంతలోనే ఏదో గుర్తొచ్చినవాడిలా ''నన్నడిగితే అన్నిటికన్నా మంచిపని డబ్బు బ్యాంకులో దాచు కోవడం. కనీసం వడ్డీ అయినా వస్తుందన్న గ్యారంటీ ఉంటుంది. అదీగాక ఏ వ్యాపారానిక యినా నువ్వు కొత్త. అందులో మెలకువలు తెలుసు కోవాలి. ఇవిగాక పనివాళ్ల జీతాలూ, షాపు బాడు గలూ, టాక్సులూ... ఇవన్నీ పోగా మొదటి సంవ త్సరంలోనే లాభం వస్తుందన్న గ్యారంటీ లేదు.

ఎప్పుడయినాసరే బిజినెస్‌లో రిస్కెక్కువ. ఫర్వా లేదనుకుంటే దిగు. దిగితేగానీ లోతు తెలియదం టారు గదా. లేదంటే- ఏ బ్యాంకులోనో వేసుకుని, కాలుమీద కాలేసుకుని కూర్చున్నా కూడా నెలనెలా వడ్డీ నీ అక్కౌంట్‌లో జమవుతుంటుంది'' అన్నాడు.

సుబ్బారావుకి నిజమేననిపించింది. తన స్నేహి తుడు ఇప్పుడు 'గీతోపదేశం' చేసిన శ్రీకృష్ణుడిలా అన్పించసాగాడు.

ఏమయినా సరే బాగా ఆలోచించి నిర్ణయం తీసు కోవాలనుకున్నాడు.

నిజమే... ఎరక్కపోయి బిజినెస్‌లోకి దిగితే అందులో నష్టం వస్తే..ఏం గాను? తిరిగి తను కోలుకోగలడా?

వ్యాపారం చేద్దామనుకున్న ఆలోచనను సుబ్బా రావు ఆ విధంగా విరమించుకున్నాడు.

ఇది జరిగిన కొన్నాళ్లకు ఓ రోజు పేపర్లో ఓ వార్త చదివాడు. తను కూడా అంతటి వాణ్ణి కావాలనుకు న్నాడు. కానీ అంతలోనే తన పేరు గుర్తొచ్చింది. చాలా బాధ కలిగింది. తన వయసేమో తక్కువ. కానీ పేరు చాలా పాతది. వెంటనే తను పేరు కూడా మార్చుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు. నిజా నికి సుబ్బారావుకి 'సుబ్బారావు' అని కాక ఏ మోడ్రన్ పేరో పెడదామని వాళ్లమ్మ ప్రపోజ్ చేసింది. కానీ వాళ్ళ నాన్న, చనిపోయిన తన తండ్రి గుర్తుగా, తండ్రి పేరుని కొడుక్కి పెట్టాడు.


ఇంతకీ సుబ్బారావుని అంతగా ఇన్‌స్పైర్ చేసిన ఆ వార్త - 'నటుడిగా ఇరవై అయిదు వసంతాలు పూర్తిచేసుకున్న చిరంజీవి'

చిరంజీవి గురించి తల్చుకుంటుంటేనే సుబ్బారా వుకి ఒళ్ళు పులకరించి పోతుంది. ఒక సామాన్య మైన కుటుంబంలో పుట్టి ఆంధ్రదేశంలో దాదాపు యువతరాన్నంతా తన వైపు తిప్పుకోగలిగా డంటే..ఇట్స్ నాట్ వండర్..మార్వెలెస్..

'నేను సినిమాల్లోకి వెళ్లకపోతే సినీ పరిశ్రమ ఓ మంచి నటుణ్ణి కోల్పోతుంది' అని చెప్పి చిరంజీవి వాళ్ల తల్లిదండ్రుల్ని ఒప్పించాడట.

కాలేజీ రోజుల్లో సుబ్బారావు ఓ నాటికలో వేషం వేశాడు. అప్పుడు ఫ్రెండ్సందరూ 'చాలా బాగా చేశావ్' అన్నారు. అప్పట్నుంచీ మనసులో ఏ మూలో 'నటుడిగా నేను రాణించగలను' అన్న సంకల్పం కలిగింది.

చిరంజీవి గురించి చదివాక సుబ్బారావు మనసా గటం లేదు. ఎలాగయినా సరే తనూ తన తల్లిదం



(డుల్ని ఒప్పించి ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లో చేరాలనుకున్నాడు.

ఓరోజు- తన తండ్రితో తన మనసులోని కోరిక చెప్పాడు.

సుబ్బారావు నాన్న కోపంతో ఎగిరిపడలేదు. తిట్టనూ లేదు. ఒకే ప్రశ్న అడిగాడు.

''నీకు నటన ఎంతవరకూ వచ్చు? అనే ప్రశ్న నేనడగబోవటం లేదు. ఇరవై అయిదు సంవత్సరాలు కష్టపడితే చిరంజీవి ఈ స్టేజికొచ్చాడు. ఇరవై అయిదేళ్ళంటే..తక్కువేం కాదు. అంత ఓపిక నీకుందా? నువ్వు చదువుకునే రోజుల్లోనే కనీసం ఫస్టుక్లాసు కూడా వచ్చేది కాదు'' అన్నాడు.

సుబ్బారావుకి కోపం వచ్చింది.

''చదువుకీ, మార్కులకీ, నేనెళ్లాలనుకుంటున్న సినిమా ఫీల్డుకీ సంబంధం లేదు నాన్నా'' అన్నాడు.

''లేకపోవచ్చు. కానీ మనం చేస్తున్న పనిమీద ఎంత శ్రద్ధ నిలుపుతున్నాం అనేది ఆ పని పూర్తయిన తర్వాత వచ్చే ఫలితాన్ని బట్టి ఉంటుంది. ఒక పని మొదలుపెడతావ్. పక్కన ఇంకో పని జరుగుతుంటే చూసి 'అరె అదయితే మనకి సరిపోతుందేమో' ననుకుంటావ్. దాన్లో కెళతావ్. అక్కణ్నుంచి యింకోదానికి. ఇలా ఎన్నని? నీకంత సహనం, పట్టుదలా ఉన్నాయా?'' అడిగాడు.

సుబ్బారావు సమాధానం చెప్పలేదు.

సడ్డా సుబ్బారెడ్డి

''ఒకవేళ నీ సినిమా హిట్టయితే, 'ఒకవేళ' నీకు మంచి పేరొస్తే..ఇలా నువ్వు 'ఒకవేళ' గురించే మాట్లాడుతున్నావ్. మరి 'ఒకవేళ' నీకు అవకాశాలే రాకపోతే, వచ్చినా 'ఒకవేళ' సినిమా పోతే....అది కూడా ఆలోచించు. కీడెంచి మేలెంచమన్నారు కదా పెద్దలు''

సుబ్బారావు ఆలోచనలో పడ్డాడు.

''నీకు తెలియని ఓ విషయం చెప్పనా- ఒక రంగంలో గుర్తింపు పొందాలంటే చిన్నప్పట్నుంచీ అందులో సాధన అవసరం. హైస్కూలు మానేసి బిజినెస్‌లోకి అడుగుపెట్టాడు అంబానీ. రేడియో పాటలకి తనకు తోచిన స్టెప్పులేసేవాడట చిరంజీవి. వాళ్లలోని ఆ లక్ష్యం అంత చిన్నవయసు

లోంచే ప్రారంభమైంది.

మరి నీ సంగతేంటి? ఇప్పుడు నీ వయసు ఇరవై ఎనిమిది సంవత్సరాలు. జీవితాన్ని, ఒక లక్ష్యాన్ని ఇప్పుడు ఫ్రెష్‌గా మొదలుపెడితే నువు నీ గమ్యాన్ని చేరుకునేదెప్పుడు?''

సుబ్బారావేం మాట్లాడలేదు.

ఆలోచిస్తున్నాడు.

నిజమే. ఒక సంవత్సరమైతే ఫర్వాలేదు. రెండయినా ఫర్వాలేదు. ఎన్ని సంవత్సరాలు కష్టపడాలో, పడినా ఎన్ని సంవత్సరాలకు గుర్తింపు వస్తుందో తెలీని ఒక రంగంలోకి ప్రవేశించడం..నిజంగా దారుణం. అదృష్టవశాత్తూ..అవకాశం వస్తే సరి..మరి రాకపోతే!

సుబ్బారావు కళ్లముందున్న భ్రమలు తొలగిపోయాయి.

వాస్తవమేంటో అర్థమైంది.

అటువంటి చోటకి వెళ్లి తర్వాత తీరిగ్గా బాధపడటం కంటే అసలు వెళ్లకపోవటమే మేలన్న నిర్ణయానికొచ్చాడు.

ఆ విధంగా సుబ్బారావు ఆ ఆలోచననూ విరమించుకున్నాడు.

కొన్నాళ్లకు స్పోర్ట్స్‌మెన్నో, క్రికెట్ ప్లేయరో అయితే బోల్డంత డబ్బూ, పాపులారిటీ రెండూ వస్తాయని ఆలోచించాడు. కానీ స్పోర్ట్స్‌మెన్‌కి ఉండాల్సిన ఫిజిక్ అతడికి లేదు. దానికంటే ముఖ్యంగా, స్పోర్ట్స్‌మెన్ కావటానికి 13- 19 సంవత్సరాల మధ్య చేయాల్సిన కృషి అతడు చెయ్యలేదు.

అందువల్ల ఆ లక్ష్యాన్నీ వెనక్కి తీసేసుకున్నాడు.

ఇప్పుడు- సుబ్బారావు ఆలోచనా, లక్ష్యమూ ఒక్కటే.

అది-కనీసం ఒక మంచి ఉద్యోగం సంపాయించుకుని తన కాళ్ల మీద తాను నిల్చబడాలన్న సంకల్పం!

★★★

ఎవరికైనా సరే 'విజయం' అనేది ఓ 'ఉప్పెనలా' రాదు. అది అంచెలంచెలుగా వస్తుంది.

ఒక లక్ష్యాన్ని సాధించాలంటే నిచ్చెనమెట్లు ఎక్కినట్టు ఒక్కోటీ ఎక్కుతూ నిదానంగా పైకి వెళుతూ ఉండాలి.

రాత్రికి రాత్రే కోట్లు సంపాదించాలనుకోవడం కంటే హీనమైన ఆలోచన మరోటి ఉండదు.

నెపోలియన్ హిల్ చెప్పినా, రాబర్ట్ కోవే చెప్పినా, జాన్ గ్రే చెప్పినా ఒక్కటే. అది- 'అన్నిటికన్నా కష్టమైన పని లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం'.

ఒక లక్ష్యాన్ని సాధించాలంటే కావలసింది పట్టుదల, సాధన, ఓర్పు.

పదిమందీ నిన్ను హేళన చెయ్యొచ్చు. నీకు నెగటివ్ థింకింగ్ నూరిపొయ్యొచ్చు. కానీ నీ చూపంతా ముందుకే ఉండాలి.

సుబ్బారావులో లేనిదదే. అతడిలో కేవలం ఆలోచనుంది. కానీ ఆచరణ లేదు.

అన్నిటికన్నా ముఖ్యంగా- 'ప్రయత్నించి చూద్దాం' అన్న తపన లేదు. అలాటి తపన లేని వాళ్లు సుబ్బారావనే కాదు ఎవరయినా సరే ఏమీ సాధించలేరు. సాధించే వాళ్లని చూసి చప్పట్లు కొడుతుంటారు. అంతే!

నాలుగురోడ్ల కూడలిలో నిలబడి కేవలం ఆలోచించడం వల్ల మనం ఎటూ వెళ్లలేం.

నాలుగడుగులు వేస్తేనే ఆ దారి తప్పో ఒప్పో తెలిసేది. అందుకే 'ఏ విషయమైనా నిదానంగా నేర్చుకుంటున్నందుకు సిగ్గుపడకు.

అసలేమీ లేకుండా నిలబడి చూస్తున్నందుకు సిగ్గుపడు' అన్నారు.

"HOW TO GET WHAT YOU WANT AND WANT WHAT YOU HAVE ' అన్న గ్రంథంలో రచయిత జాన్ గ్రే ఇలా చెబుతాడు.

''నీకో కోరికుంటే దాన్ని నెరవేర్చుకోవటానికి ప్రయత్నించు. మొదటిసారి కాబట్టి ఫెయిలవుతావు. ఫర్వాలేదు రెండోసారి ప్రయత్నించు. ఫెయిలయితే మళ్లీ ప్రయత్నించు.

అలా సాధన కొనసాగించు.

ఏ క్షణంలోనైనా నీమీద నువ్వు నమ్మకం కోల్పోకు. అలా కోల్పోవడం మొదలుపెడితే... 'మళ్లీ ప్రయత్నించాలి' అన్న కోరిక తగ్గిపోతుంది.

కొత్త విషయం తెలుసుకుందామన్న జిజ్ఞాస తగ్గిపోతుంది. ఆలోచన మారుతుంది. 'అన్నిసార్లు ప్రయత్నించినా సాధించలేకపోయాం.

అంత కష్టపడటం అవసరమా? అది లేకుండా ఇన్నాళ్లూ బ్రతికాం కదా.

ఇక మీదట బ్రతకలేమా?' అన్పిస్తుంది.

నిదానంగా కోరిక నశిస్తుంది.

ఆ విధంగా అందని ద్రాక్షపళ్ల పుల్లన అవుతాయి

★★★

అందుకే లతా మంగేష్కర్ చెప్పినట్టు-

''మనం నమ్ముకోవాల్సింది అదృష్టాన్ని కాదు..మన కష్టాన్ని''

## ఆనందం

**పుట్టినరోజు పండగ జరుపుకునేవారితో పాటూ బంధువులకి, సన్నిహితులకి ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ఈమధ్య పుట్టినరోజు జరుపుకున్న షారూక్ ఎంతో హుషారుగా కన్పించాడు. ఇక్కడ విశేషమేమిటంటే ఐన్ బర్త్‌డే కేక్ కట్ చేసిన ఇరవై నాలుగ్గంటల లోపే షారూఖ్ బర్త్‌డే కేక్ కట్‌చేశాడు. ఈ ఫంక్షన్‌లో కరణ్‌జోహార్, అమితాబ్ బచ్చన్, అజయ్‌దేవగన్, యాష్ జోహార్‌లతో పాటూ సంజయ్‌లీలా భన్సాలీ, సయిఫ్ అలీఖాన్ కూడా పాల్గొని గ్రీటింగ్స్ చెప్పారట. వీరంతా ఒక ఎత్తైతే ముద్దుగుమ్మలు కాజోల్, ప్రీతీజింతా, జూహీ చావ్లాలతో పాటూ జయా బచ్చన్ కూడా హాజరై అందరికీ కనువిందు చేశారు. ఈ బర్త్‌డేని తాను ఎప్పటికీ మర్చిపోలేనని చెబుతున్నాడు షారూక్.**

